

**బతుకు చక్రం ఆగిపోతోంది..**

లారీలకు సరిపడా బొగ్గు లోడింగ్ ఇవ్వడం లేదని ఆరోపిస్తూ యజమానులు సత్తుపల్లిలో చిన్నారులతో సహా ఆందోళనకు దిగారు. 8లో



**మట్టి తవ్వకాలపై రగడ**

కొణిజర్ల మండలం గుబ్బగుర్తి పెద్దచెరువులో చేపడుతున్న మట్టి తవ్వకాలను మత్స్యకారులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. 8లో

గరిష్టం / కనిష్టం 32° / 25°

**వాతావరణం**

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. ఆతర్వాత మాత్రం గంట గంటకు ఎండ పెరిగే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### సత్వర న్యాయమే లోక్‌అదాలత్ ధ్యేయం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మంలీగల్: కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా నిర్వహించే లోక్ అదాలత్ విజయవంతానికి అందరూ సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ పిలుపునిచ్చారు. వచ్చేనెల 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేలా న్యాయమూర్తి గురువారం వివిధ శాఖల అధికారులు, న్యాయమూర్తులు, న్యాయవాదులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ రాజీపడదగిన క్రిమినల్ కేసుల్లో ఇరుపక్షాల వారికి లోక్ అదాలత్ వల్ల లాభాలను వివరించాలని సూచించారు. ఒకేరోజు ఎక్కువ మంది కక్షిదారులు వస్తే ఇబ్బంది ఎదురయ్యే అవకాశమున్నందున ప్రతిరోజు లోక్ అదాలత్ నిర్వహించేలా ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ఆపై బీమా కంపెనీలు, ఫైనాన్స్ కంపెనీ బాధ్యులతో సమావేశమై నష్టపరిహారం కేసుల పరిష్కారానికి సూచనలు చేశారు. న్యాయమూర్తులు కె.ఉమాదేవి, వి.అపర్ణ, కె.వి.చంద్రశేఖర్‌రావు, ఎం.కల్పన, వై.బిందుప్రియ, వి.మాధవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెల్ల శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### జిల్లా పశువైద్యాధికారిగా నారాయణ



నారాయణకు శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా పశు సంవర్ధక, పశు వైద్యాధికారిగా కే.వీ.నారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ బి.వేణుమనోహర్‌రావు సెలవుపై వెళ్తుండడంతో హన్మకొండ అధికారి నారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో బాధ్యతలు స్వీకరించిన ఆయనను జిల్లా పశువైద్యుల సంఘం బాధ్యులు డాక్టర్ ఉపేందర్, రమేష్‌బాబు, అనంత హరీష్, సంజయ్‌రెడ్డి, భువనేష్‌కుమార్, నాగేశ్వరరావు, సుబ్బారావు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### ఎమ్మెల్సీ ఎన్నికకు బీఆర్‌ఎస్ సమన్వయకర్తలు

ఖమ్మంమయూరిసెంటర్: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యాన జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాలకు బీఆర్‌ఎస్ సమన్వయకర్తలను నియమించింది. ఈమేరకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ గురువారం ప్రకటన జారీ చేశారు. ఇందులో భాగంగా ఖమ్మం నియోజకవర్గానికి గుండాల కృష్ణ, పాలేరుకు తాళ్లూరి జీవన్‌కుమార్, సత్తుపల్లికి ఎం.డీ.ఖమర్, మధిరకు బిచ్చాల తిరుమలరావు, వైరా నియోజకవర్గానికి లకావత్ గిరిబాబు నాయక్‌ను సమన్వయకర్తలుగా నియమించినట్లు తెలిపారు.

### సుమనోహరం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం సుమనోహరంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

### డీసీసీబీ బదిలీల్లో వివాదం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) పరిధిలో జరిగిన అధికారుల, ఉద్యోగుల బదిలీల వ్యవహారం వివాదానికి దారితీసింది. డీసీసీబీ బ్రాంచ్‌ల్లో మూడేళ్ల సర్వీస్ నిండిన 92 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 30 మంది మేనేజర్లను బదిలీ చేస్తూ సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారంలో చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, సీఈఓ నడుమ తేడా రావడంతో సీఈఓను గురువారం చైర్మన్ ప్రశ్నించారు. అయితే, నిబంధనల మేరకు బదిలీ చేశామని సీఈఓ బదులివ్వగా, ఇరువురి మధ్య వివాదం పెరిగిందని సమాచారం. కాగా, బదిలీ అయిన వారు పలువురు నూతన స్థానాల్లో చేరగా, ఇంకొందరు తాము కోరుకున్న స్థానాలు కాకపోవడంతో వెనుకాడుతున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా బదిలీల వ్యవహారం డీసీసీబీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# గాలికి వదిలేశారా!?

సహజంగా మనకు కావాల్సిన ఉత్పత్తి ఏదైనా ఇంట్లో చేయగలిగే పరికరాలు ఉంటే సద్వినియోగం చేసుకుంటాం. అది సాధ్యం కాకపోతేనే బయట కొనుగోలు చేస్తాం. కానీ జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రిలో మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతోంది. రూ.కోట్ల విలువైన ఆక్సీజన్ ఉత్పత్తి ప్లాంట్ ఉన్నప్పటికీ దాన్ని మూలన పడేసి బయట నుంచి కొనుగోలుకే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ప్లాంట్ నిరుపయోగంగా మారి నానాటికీ పనికి రాకుండా పోతున్నా పట్టింపు లేనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. – ఖమ్మంవైద్యవిభాగం

**జిల్లా పెద్దాస్పత్రిలో నిరుపయోగంగా ఆక్సీజన్ ప్లాంట్**

- కరోనా సమయాన రూ.1.20 కోట్లతో ఏర్పాటు
- ఆపై నిర్వహణ, ఉత్పత్తిని పట్టించుకోని అధికారులు
- ఆర్థిక భారం పడుతున్నా బయట నుంచి కొనుగోలుకే మొగ్గు



ప్లాంట్‌లో శిథిలమవుతున్న ట్యాంక్‌లు, సామాగ్రి



పెద్దాస్పత్రిలోని ఆక్సీజన్ కాన్సంట్రేటర్ ప్లాంట్ గది

**2021 మే నెలలో ఏర్పాటు**

కరోనా రెండో వేవ్ సమయాన ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆక్సీజన్ కొరత ఏర్పడగా.. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.1.20 కోట్లతో 2021 మే నెలలో గాలి నుంచి ఆక్సీజన్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్లాంట్లు మంజూరు చేయగా జాబితాలో ఖమ్మంకు స్థానం దక్కింది. ఈమేరకు పెద్దాస్పత్రి ఆవరణలో అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానంతో ఆక్సీజన్ కాన్సంట్రేటర్ ప్లాంట్ ఏర్పాటుచేశారు. ఈ ప్లాంట్‌లో సహజ సిద్ధమైన గాలిని ఒత్తిడికి గురిచేసి నైట్రోజన్, కార్బన్ డై ఆక్సైడ్ తదితర వాయువులను.. ఆక్సీజన్‌ను వేరు చేస్తారు. ఈ ప్లాంట్ గంటకు సుమారు 2వేల లీటర్ల ఆక్సీజన్ ఉత్పత్తి చేసే సామర్థ్యంతో ఏర్పాటైంది. తద్వారా వేలాది మంది కరోనా బాధితుల ప్రాణాలు కాపాడడం సాధ్యమైంది. అయితే, కరోనా వ్యాప్తి తగ్గుముఖం పట్టాక కూడా ఆస్పత్రికి వివిధ సమస్యలతో వచ్చే వారికి ఆక్సీజన్ అవసరమవుతుందని తెలిసినా అధికారులు ప్లాంట్ నిర్వహణను పట్టించుకోకపోవడంతో మూలన పడింది. అంతేకాక నిర్వహణకు కేటాయించిన టెక్నీషియన్, ఇతర సిబ్బందిని సైతం తొలగించారు.

**వ్యయం తగ్గించే అవకాశం ఉన్నా....**

ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి అవసరమైన ఆక్సీజన్‌ను ట్యాంకర్ల ద్వారా తెప్పించి లిక్విడ్ ఆక్సీజన్ ప్లాంట్‌లో నింపుతున్నారు. ఒక్కో ట్యాంకర్ ఖరీదు రూ.2 లక్షల నుండి రూ.3 లక్షల అవుతుండగా.. సాధారణ రోజుల్లో నెలకు 3 నుంచి 4 ట్యాంకర్లు అవసరమవుతున్నాయి. అదే సీజనల్ వ్యాధుల వ్యాప్తి సమయాన వినియోగం మరింత పెరుగుతుంది. ఒకవేళ గాలి ద్వారా ఆక్సీజన్ ఉత్పత్తి చేసే ప్లాంట్ అందుబాటులోకి తీసుకొస్తే వ్యయం సగానికి పైగా తగ్గుతుందని.. సాధారణ రోజుల్లో ఆక్సీజన్ కొనుగోలు చేసే అవసరముండదని చెబుతున్నారు. అయినా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనేది అంతు చిక్కని ప్రశ్నగానే మిగిలిపోతోంది.

**మరో ప్లాంట్ కూడా..**

కరోనాకు ముందు ఆస్పత్రిలో బాధితులకు చికిత్స కోసం అవసరమయ్యే ఆక్సీజన్‌ను సిలిండర్ల ద్వారా కొనుగోలు చేసేవారు. ఆతర్వాత గాలి ద్వారా ఆక్సీజన్ ఉత్పత్తి చేసే ప్లాంట్(ఆక్సీజన్ కాన్సంట్రేటర్ ప్లాంట్)ను ఏర్పాటుచేయగా.. లిక్విడ్ ఆక్సీజన్ ప్లాంట్‌ను సైతం ఏర్పాటు చేశారు. లిక్విడ్ ఆక్సీజన్ ప్లాంట్‌ను 13వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్ నిర్మించగా, ఈ ప్లాంట్‌లో ఆక్సీజన్ సరఫరా ఖర్చుతో కూడుకున్నదని చెబుతున్నారు. ప్రస్తుతం ఆక్సీజన్ కాన్సంట్రేటర్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకొస్తే ఖర్చు తగ్గే అవకాశమున్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..**



ప్లాంట్‌లో చాలా కాలంగా ఆక్సీజన్ ఉత్పత్తి నిలిచిపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి నిర్ణయం ప్రకారం ఉత్పత్తి ప్లాంట్‌ను పునరుద్ధరించాల్సి ఉంటుంది. ప్లాంట్ అందుబాటులోకి వస్తే వ్యయం తగ్గనుండడంతో ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి ఆస్పత్రిలో ఆక్సీజన్ కొరత లేదు.

– ఎల్.కిరణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్



# కొనుగోళ్లు కొంతే...

**4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా**

- ఇప్పటివరకు 18,917 మెట్రిక్ టన్నులే పూర్తి
- వ్యాపారులు కల్లాలపైనే కొనుగోలు చేయడంతో ఆమడదూరాన లక్ష్యం
- దిగుబడి లేకపోవడంతో కేంద్రాలకు రాని రైతాంగం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు (ఫైల్)

ఖమ్మం సహకారనగర్: యాసంగి సీజన్‌లో జిల్లా రైతులు సాగుచేసిన వరి ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా కొనసాగుతున్నాయి. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన వివిధ శాఖల భాగస్వామ్యంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయగా, లక్ష్యం ఇంకా ఆమడదూరంలోనే ఉంది. అధికారులు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరడం అసాధ్యమని ఇప్పటికే తేలిపోగా.. మరికొన్నాళ్లు కేంద్రాలను కొనసాగించనున్నట్లు చెబుతున్నారు. పలుమార్లు ఈ అంశంపై కలెక్టర్ గౌతమ్ నేరుగా సమీక్షించినా, వేగం పెరగకపోగా రైతులు పెద్దగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రావడం లేదని తెలుస్తోంది. ఫలితంగా లక్ష్యసాధనలో వెనుకబడినట్లు చెబుతున్నారు.

**87 కేంద్రాలకే సరుకు**

జిల్లాలోని 21 మండలాల పరిధిలో 236 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనేది లక్ష్యం. అయితే, కేవలం 87 కేంద్రాలకు మాత్రమే రైతులు ధాన్యం తీసుకురాగా, ఇప్పటి వరకు 18,917.680మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రం సేకరించగలిగారు. ఇందులో గ్రేడ్–ఏ ధాన్యం 8,448.040మెట్రిక్ టన్నులు, కామన్ రకం 10,469.640మెట్రిక్ టన్నులుగా ఉంది. కాగా, ఎండల నేపథ్యాన కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులు ఇబ్బంది పడొద్దనే భావనతో టెంట్లు, తాగునీటి వసతి కల్పించడమే కాక పట్టాలు, నాణ్యత పరిశీలించే మిషన్లు, గన్నీ సంచులు సమకూర్చినా ఫలితం లేకుండా పోయింది.

**లక్ష్యం గగనమే..**

జిల్లాలో రబీ సీజన్‌లో 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా.. 18,917 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ మాత్రమే సాధ్యమైంది. వరి సాగు విస్తీర్ణం ఆధారంగా అంచనా వేసినట్లు దిగుబడి రాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఇప్పటివరకు అతి తక్కువ స్థాయిలో కొనుగోళ్లు జరగడంతో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యం కాదనేది తేలిపోయింది.

**వ్యాపారుల ముందంజ**

జిల్లాలో భూగర్భ జలాల కొరత కారణంగా ఈసారి ఆశించిన స్థాయిలో పంటల దిగుబడి రాకపోగా.. పండిన ధాన్యాన్ని సైతం వ్యాపారులు ముందుగా కొనుగోలు చేశారు. పంట కల్లాల వద్దకే వెళ్లి పచ్చిగా ఉన్నప్పుడే ధాన్యం సేకరించారు. ఇక మిగిలిన కొందరు రైతులే ప్రభుత్వ కేంద్రాలకు రావడంతో సేకరణ తగ్గినట్లు తెలుస్తోంది. ఇక జిల్లాలో పౌరసరఫరాల శాఖ, డీసీఎంఎస్, డీఆర్‌డీఏ, పీఏసీఎస్ శాఖల మధ్య సమన్వయ లోపం కూడా కొనుగోళ్లపై ప్రభావం చూపినట్లు ప్రచారం జరుగుతోంది.

**కొనుగోళ్లు కొనసాగుతున్నాయి..**



జిల్లాలోని 87 కేంద్రాలకు ఇంకా ధాన్యం వస్తోంది. భూగర్భ జలాలు అడుగంటిన నేపథ్యాన సాగుతో పాటే దిగుబడి తగ్గింది. రైతులు కేంద్రాలకు తీసుకొస్తున్న చోట నాణ్యత ఆధారంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. జూన్ చివరి వరకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయి.

– జి.శ్రీలత, పౌరసరఫరాల సంస్థ మేనేజర్

# ఎమ్మెల్సీ ఎన్నిక ఏర్పాట్లలో వేగం



ఎమ్మెల్సీ ఎన్నిక ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- అధికారుల నియామకం, ఏర్పాట్లపై సమీక్ష

ఖమ్మం సహకారనగర్: వరంగల్ – ఖమ్మం – నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక ఏర్పాట్లలో వేగం పెంచాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో గురువారం సమావేశమైన ఆయన పోలింగ్ అధికారుల నియామకం, ఎన్నిక ఏర్పాట్లపై ఆరా తీసి సూచనలు చేశారు. ఈనెల 27న పోలింగ్ జరగనున్నందున 118 కేంద్రాల్లో అవసరమైన 142 మంది చొప్పున పీఓలు, ఏపీఓలతో పాటు 284 మంది ఓపీఓలను గుర్తించి శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఆతర్వాత ఏఆర్వోలతో సమావేశమైన కలెక్టర్ ఎన్నిక నిర్వహణపై సూచనలు చేశారు. ప్రత్యేక బృందాలను నియమించడంతో పాటు పోలింగ్ కేంద్రాల్లో వసతులను తనిఖీ చేయాలని చెప్పారు.

**యూనిఫాం పంపిణీకి కార్యాచరణ**

విద్యాసంవత్సరం సమీపిస్తున్నందున ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులకు యూనిఫామ్ అందించేందుకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో సమావేశమైన ఆయన విద్యార్థులందరికీ సకాలంలో యూనిఫామ్ అందించేలా విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మహిళా గ్రామైక్య సంఘాలకు యూనిఫామ్ కుట్టే బాధ్యత అప్పగించాలని సూచించారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, డీఈఓ సోమశేఖరశర్మ, జిల్లా ఉపాధికల్పన అధికారి శ్రీరాం, డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, ఎస్‌డీసీ రాజేశ్వరి, ఆర్డీఓలు గణేష్, రాజేందర్, ఉద్యోగులు అరుణ, మదన్‌గోపాల్, రాంబాబు, సత్యనారాయణ, వెంకటరమణ, నూరుద్దీన్, రాజశేఖర్, సతీష్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

**స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతర పర్యవేక్షణ**

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్ వద్ద నిరంతరం పర్యవేక్షించాలని ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ను గురువారం పరిశీలించిన ఆయన ఉద్యోగులకు సూచనలు చేశారు. జిల్లా భూగర్భ జలశాఖ అధికారి శ్యాంప్రసాద్, ఉద్యోగులు రాంబాబు, హుస్సేన్ పాల్గొన్నారు.

### సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచండి



కొత్తలింగాలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ

ఖమ్మంవ్యవసాయం: రానున్న వానాకాలం సీజన్‌లో రైతులకు సరిపడా నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయనిర్మల సూచించారు. ఖమ్మంలోని తన కార్యాలయంలో గురువారం ఆమె విత్తన కంపెనీల బాధ్యులతో సమావేశమయ్యారు. పత్తి, మిరప ఇతర పంటల విత్తనాలు నాణ్యమైనవే అమ్మాలని, కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈసమావేశంలో ఏడీఏలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, విజయ్ బాదల్, నర్సింహారావు, కరుణశ్రీ, ఏఓ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

**భూసార పరీక్ష.. రైతుకు రక్ష**

కామేపల్లి: రైతులు పంటల్లో అధిక దిగుబడి సాధించాలంటే భూసార పరీక్ష తప్పనిసరిగా చేయించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల తెలిపారు. కామేపల్లి మండలంలో కొత్తలింగాలలో గురువారం ఆమె భూసార పరీక్షల ఆవశ్యకత, పంట వ్యర్థాలను కాల్చడంతో ఎదురయ్యే అనర్థాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా జాగ్రత్తలు పాటిస్తే ఖర్చు తగ్గడమే కాక దిగుబడి పెరుగుతుందని తెలిపారు. అనంతరం ఆమె కామేపల్లిలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ తారాదేవి, ఏఈఓలు మున్నీ, ప్రతిభ, జగదీశ్, మహేష్, ఉష, శ్రీకన్యతో పాటు రైతులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన ట్రాన్స్‌కో ఏఈఈ

**రైతు నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారి**



పట్టుబడిన ట్రాన్స్‌కో ఏఈఈ, నగదుతో ఏసీబీ డీఎస్పీ రమేష్ తదితరులు

అశ్వారావుపేటరూరల్: ఓ రైతు భూమిలో విద్యుత్‌లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ట్రాన్స్‌కో ఏఈఈ(ఆపరేషన్స్) రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన రైతు కొనకళ్ల జనార్దన్‌రావుకు అశ్వారావుపేట మండలం మద్దికొండ(భీమునిగూడెం) సమీపాన ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రైతు కుమారుడు ఆదిత్య నెల క్రితం మీ సేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేశాడు. ఆ తర్వాత ట్రాన్స్‌కో ఏఈఈ(ఆపరేషన్స్) శరత్‌కుమార్‌ను కలిసి ఈ విషయం చెప్పగా రూ.1.81 లక్షలుగా అంచనా వేసి డీడీ రూపంలో చెల్లించాలని సూచించారు. ఆయన సూచన మేరకు ఆదిత్య డీడీ అందజేశాడు. అయితే డీడీతో పాటు అదనంగా మరో రూ.లక్ష ఇవ్వాలని ఏఈఈ డిమాండ్ చేయగా, ఆదిత్య ఖమ్మం ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఏసీబీ డీఎస్పీ రమేష్ బృందం రంగంలోకి దిగి.. బాధితుడి నుంచి స్థానిక శ్రీ లక్ష్మీ తులసీ అగ్రో పేపర్ బోర్డు వద్ద ఏఈఈ శరత్‌కుమార్ రూ.లక్ష లంచం తీసుకుంటుడగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈమేరకు పట్టుబడిన నగదును సీజ్ చేసి ఏఈఈపై కేసు నమోదు చేసి ఖమ్మం ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఈ తనిఖీల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు ఎస్. శేఖర్, డి.సునీల్, మహేష్, హెడ్ కానిస్టేబుల్ పుల్లయ్య, సిబ్బంది శ్రీను, శ్రీనివాసాచారి, రంగా తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగు విస్తరణపై దృష్టి

**ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి**



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న జీఎం సుధాకర్‌రెడ్డి

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: ఆయిల్‌పామ్ సాగు విస్తరణపై దృష్టి సారించాలని, ఈ ఏడాది లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి సూచించారు. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెంలోని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ కార్యాలయంలో క్షేత్ర స్థాయి ఉద్యోగులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉద్యోగులకు కేటాయించిన ఖరీఫ్ సాగు లక్ష్యాన్ని పూర్తి చేసి, రబీ లక్ష్యానికి సంబంధించిన ప్రణాళికలు సమర్పించాలని ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 17,500 ఎకరాలు, రబీకి 8,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను విస్తరించాలన్నారు. సాగు విస్తరణకు సరిపడా ఆయిల్‌పామ్ మొక్కలు ఆయిల్‌ఫెడ్ నర్సరీల్లో సిద్ధంగా ఉన్న విషయాన్ని రైతులకు వివరించాలని చెప్పారు. అనంతరం జీఎం విలేకరులతో మాట్లాడుతూ పంట సాగు విస్తరణపై దృష్టి సారించామని, ఈ ఏడాది లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. ఇప్పటికే అనువైన వ్యవసాయ భూములను గుర్తించగా, రైతులకు సబ్సిడీపై మొక్కలు అందిస్తామన్నారు. అలాగే పోడు పట్టాలు అందుకున్న గిరిజన రైతులకు కూడా ఆయిల్‌పామ్ సబ్సిడీ పథకాలను వర్తింపజేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, తోటలకు అవసరమైన బోరాన్ ఎరువులు రైతులకు త్వరలోనే అందిస్తారని జీఎం తెలిపారు. ఆతర్వాత జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో విస్తరణ పనులను పరిశీలించడమే కాక గెలల క్రషింగ్‌పై ఆరా తీశారు. ఈ సమావేశాల్లో డీఓ ఆకుల బాలకృష్ణ, వివిధ విభాగాలు, ఫ్యాక్టరీల మేనేజర్లు భారతి, శ్రీకాంత్ రెడ్డి, జె.సత్యనారాయణ, బాలకృష్ణ, కల్యాణ్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రామారావు


కే.ఎస్.రామారావు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని నయబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కేఎస్.రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపాళ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయనను గతేడాది అక్టోబర్ 3న జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీ చేయగా, రామారావు హైకోర్టును ఆశ్రయించడంతో యథావిధిగా నయబజార్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగించాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యాన బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి కళింగ కృష్ణకుమార్, జీజేఎల్ఏ రాష్ట్ర మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబురావు, ఎం.వీ.గోనారెడ్డి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### చెన్నారం వాసికి డాక్టరేట్


వెంకటరత్నం

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ బట్టపోతుల వెంకటరత్నంకు డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌కు చెందిన సీబీఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఓయూ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. మారుమూల గ్రామమైన చెన్నారానికి చెందిన నిరుపేద దంపతులు ఫ్రాన్సిస్–రామలక్ష్మి కుమారుడైన వెంకటరత్నం డాక్టరేట్ అందుకోవడంపై పలువురు అభినందించారు.

### ధాన్యం నిల్వలపై అధికారుల తనిఖీలు


విచారణ నిర్వహిస్తున్న ఉద్యోగులు

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురంలో ఓ వ్యాపారి కుటుంబం భారీగా ధాన్యం నిల్వ చేసిందనే ఫిర్యాదుతో సివిల్ సప్లయీస్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన పి.కృష్ణమూర్తి ఈ అంశంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సివిల్ సప్లయీస్ డీటీ మహ్మద్ అబ్దుల్ నిసార్, ఆర్ఐ నరేష్ తదితరులు తనిఖీ చేశారు. అయితే, వ్యాపారి వద్ద ఉన్న ధాన్యం తమది కాదని, రైతులు నిల్వ చేశారని చెప్పగా రైతులను పిలిపించి ఆరా తీశారు. రైతులు సైతం ధాన్యం తమదేనని లిఖితపూర్వకంగా రాసి ఇవ్వడంతో నివేదికను డీఎస్ఓకు సమర్పించనున్నట్లు డీటీ తెలిపారు.

### పాలకుల విప్లవ ప్రతిఘాతక దాడిని ఓడిద్దాం

మావోయిస్టు పార్టీ నేత ఆజాద్

చర్ల: భారత విప్లవోద్యమ నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న విప్లవ ప్రతిఘాతక దాడిని ఓడించడంతో పాటు మావోయిస్టుల పేరుతో ఆదివాసీలను బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపుతున్న పాలకుల తీరును ఖండించాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరిట గురువారం లేఖ విడుదల చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ దాడుల్లో భాగంగానే గ్రామాలపై దాడులు చేస్తూ అత్యాచారాలకు పాల్పడడమే కాక మావోయిస్టుల పేరుతో ఆదివాసీలను చంపి ఎన్‌కౌంటర్లుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టు పార్టీ నిర్మూలన పేరుతో గత మూడున్నర నెలల కాలంలో 103 మందిని పొట్టనబెట్టుకోగా అందులో 60 మంది ఆదివాసీ మహిళలు, వృద్ధులు, పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. 2024 నాటికల్లా మావోయిస్టు పార్టీని మట్టుబెడతామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించిన తర్వాత ఈ దాడులు పెరిగాయని తెలిపారు. ఆదివాసీ ప్రాంతాలు.. ఆపై దేశాన్ని కార్పొరేట్లకు అప్పగించడం కోసమే ఈ దాడుల పరంపర కొనసాగుతోందని ఆరోపించారు. ఆదివాసీ త్యాగాలతో రక్తసిక్తమవుతున్న అడవుల్లో ప్రభుత్వాలు రహదారులు వేసి అడవులను ఖాకీమయం చేయడం ద్వారా అపారమైన ప్రకృతి వనరులను తరలిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి చర్యలను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, హక్కుల సంఘాల నేతలు ఖండించాలని ఆజాద్ ఆ లేఖలో కోరారు.

### పామాయిల్ తోట దగ్ధం

కరకగూడెం: పామాయిల్ తోట దగ్ధమైన ఘటన పినపాక మండల పరిధిలోని జానంపేట గ్రామంలో గురువారం జరిగింది. బాధిత రైతుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతులు అశోక్, సత్యం మూడు ఎకరాల్లో పామాయిల్ సాగు చేశారు. ప్రమాదవశాత్తు మధ్యాహ్నం సమయంలో మంటలు చెలరేగి తోటలో ఏర్పాటు చేసిన డ్రిప్ పైపులతోపాటు కొన్ని మొక్కలు కాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.14,229 |

# బతుకు చక్రం ఆగిపోతోంది..

**లారీలకు బొగ్గు లోడింగ్ ఇవ్వాలని యజమానుల ఆందోళన**

- ఆర్‌సీహెచ్‌పీకి రవాణా నిలిపివేయాలని డిమాండ్
- సత్తుపల్లిలో చిన్నారులతో కలిసి జీఎం ఆఫీస్ ముట్టడి
- ఎమ్మెల్యే సమక్షాన చర్చలు సైతం విఫలం


జీఎం కార్యాలయం ఎదుట చిన్నారులతో సహా బైఠాయించిన లారీల యజమానులు

సత్తుపల్లి: నాణ్యమైన బొగ్గు లోడింగ్ ఇవ్వకపోవడంతో సరిపడా కిరాయి దక్కక తమ కుటుంబాలు ఆకలితో అలమటించాల్సి వస్తోందని లారీల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్తుపల్లిలో మూడు రోజుల నుంచి లారీల యజమానులు, డ్రైవర్లు చేస్తున్న ఆందోళన గురువారం తీవ్రరూపం దాల్చింది. కుటుంబాల్లోని పిల్లలతో సహా వారు జీఎం కార్యాలయం ఎదుట చేపట్టిన ఆందోళన రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది. ఆతర్వాత ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి చేరుకోగా.. ఆమె సమక్షాన జరిగిన చర్చల్లో విషయాన్ని సీఎండీ దృష్టికి తీసుకెళ్తామని జీఎం తెలిపారు. దీంతో ఆందోళన విరమించిన లారీల యజమానులు శుక్రవారం నాటికి సమస్య పరిష్కారం కాకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని ప్రకటించారు.

**ఏమిటీ సమస్య...**

సత్తుపల్లికి చెందిన లారీలకు కిష్టారం నుంచి బొగ్గు ఉత్పత్తిలో 40 శాతం లోడింగ్ ఇవ్వాల్సి ఉన్నా పది శాతమే ఇస్తుండడంతో ఇబ్బంది పడుతున్నామని యజమానులు చెబుతున్నారు. అలాగే, కిష్టారం ఓసీ నుంచి లారీలకు నాణ్యమైన బొగ్గు ఇవ్వకపోవడంతో పరిశ్రమల వద్ద దిగుమతి చేసుకోవడం లేదని తెలిపారు. దీంతో పరిశ్రమల వద్ద మూడు, నాలుగు రోజులు లారీలు వేచి ఉండాల్సి వస్తోందని వాపోయారు. ఈమేరకు మూడు రోజులుగా నిరసన తెలుపుతున్న లారీల యమానులు, డ్రైవర్లు గురువారం సత్తుపల్లిలోని కొత్తగూడెం జీఎం కార్యాలయం ఎదుట పిల్లలతో సహా ఆందోళన చేపట్టారు. 'మా లారీలకు లోడింగ్ అవకాశం కల్పించండి.. మా విద్య, ఆరోగ్యం, భవిష్యత్ కోసం సహకరించండి.. ప్లీజ్ అంకుల్స్' అని రాసి ఉన్న ప్లకార్డులను చిన్నారులు ప్రదర్శించారు. తమ స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలకు డబ్బులు లేనందున సహకరించాలని కోరారు. కాగా, ఇక్కడ ఉత్పత్తి అయ్యే నాణ్యమైన బొగ్గును స్థానిక లారీలకే లోడింగ్ చేయాలని రుద్రంపూర్ కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్‌కు తరలిస్తే ఊరుకునేదిలేదని యామానులు తెలిపారు. అయితే, కిష్టారం ఓసీలో బొగ్గు నిల్వలు ఉన్న విషయాన్ని పరిశ్రమలకు లేఖ రాశామని.. వారు ముందుకొస్తే అంత మేర తగ్గించి ఆర్‌సీహెచ్‌పీకి తరలిస్తామని జీఎం షాలేం రాజు చెప్పడంతో యజమానులు అభ్యంతరం తెలిపారు. ఆర్‌సీహెచ్‌పీకి బొగ్గు రవాణా చేసే ఆందోళనలు ఉధృతం చేస్తామని, సత్తుపల్లిలో నాణ్యమైన బొగ్గు ఉన్నా కొన్ని పరిశ్రమలు కొత్తగూడెం, మణుగూరుకే వెళ్లడానికి అధికారులే కారణమని ఆరోపించారు.

**మీకు సైతం లోడింగ్ ఇస్తాం..**

లారీ యజమానులకు ఇబ్బంది లేకుండా బొగ్గు లోడింగ్ ఇస్తామని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేంరాజు సర్దిచెప్పారు. నాణ్యమైన బొగ్గు ఇస్తామని, ఈ అంశంపై నిరంతరం పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. అలాగే, కిష్టారం నుంచి బొగ్గు కొనుగోలు చేసేలా పరిశ్రమల యాజమాన్యలతో చర్చలు జరుపుతున్నామని వెల్లడించారు. ఇదే సమయాన ఆర్‌సీహెచ్‌పీ బొగ్గు రవాణా నిలిపివేత అధికారం తనకు లేదని స్పష్టం చేశారు. కాగా, లారీల యజమానుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ చేరుకుని జీఎంతో యజమానుల సమక్షాన చర్చించారు. ఈమేరకు సమస్యను సీఎండీ దృష్టికి తీసుకెళ్తానని జీఎం చెప్పగా.. యజమానులు ఆందోళన తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ప్రకటించారు. సమస్య పరిష్కారం కాకపోతే శుక్రవారం ఆందోళనలు ఉధృతం చేస్తామని వెల్లడించారు.

**ఎమ్మెల్యే సమక్షాన చర్చలు జరిపినా..**

నాణ్యమైన బొగ్గు లోడింగ్ ఇప్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో లారీ యజమానులు రెండురోజులుగా చర్చలు జరుపుతున్నారు. సింగరేణి అధికారుల సమక్షాన చర్చలు జరిగినా కొలిక్కి రాకపోవటంతో సమస్య అలాగే మిగిలిపోయింది. నాణ్యమైన బొగ్గు ఇవ్వడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఇబ్బంది ఎదురవుతోందని లారీల యజమానులు చెబుతుండగా.. అధికారులు మాత్రం నాణ్యమైన బొగ్గే ఇస్తున్నామని వాదన వినిపించారు.


ఎమ్మెల్యే రామగయి సమక్షాన లారీల యజమానులతో చర్చిస్తున్న జీఎం షాలెంరాజు

# అభివృద్ధికి నిధులు కేటాయించాలి

**సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన ఎమ్మెల్యేలు**


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు పాయం, తెల్లం, పక్కన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మణుగూరు టౌన్/భద్రాచలంటౌన్: నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్‌లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కోరారు. గురువారం వారు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో వెళ్లి హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ ఎన్నికల ప్రచార సరళి, ఓటింగ్ నమోదు, గెలుపు అవకాశాలు తదితర విషయాలను సీఎంకు వివరించారు. అనంతరం నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యాచరణపై చర్చించారు. భద్రాచలంలో మహిళా జూనియర్ కళాశాల, చర్ల మండలంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, భద్రాచలం కరకట్ట నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, తాలిపేరు, పాలెంవాగు, గుండ్లవాగు తదితర చిన్న తరహా ప్రాజెక్టుల ఆధునికీకరణ చేపట్టాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని సీఎంకు వివరించారు. సమస్యలు పరిష్కరిస్తామని, భద్రాచలం పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీ పేదలకు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు.

# 20 వేల మెజార్టీతో విజయం ఖాయం



సమ్మేళనంలో మాట్లాడుతున్న తాండ్ర వినోద్‌రావు

**బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు**

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం లోక్‌సభ స్థానంలో 20వేల నుండి 30 వేల వరకు మెజార్టీతో తన విజయం ఖాయమని బీజేపీ లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలు తనను ఓటు వేసినట్లు తెలుస్తోందని చెప్పారు. ఈ విషయంలో పీఎం కార్యాలయం నుంచి తనకు ఫోన్ వచ్చిందని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో అన్ని పనులు పక్కన పెట్టి పాల్గొన్న పార్టీ నాయకులు అండగా నిలుస్తానని పేర్కొన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన, ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసికట్టుగా పనిచేయడంతో విజయం దక్కనుందని చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు డాక్టర్ శీలం పాపారావు, పిట్టల వెంకటనర్సయ్య, శ్యాంరాథోడ్, నెల్లూరి కోటేశ్వరావు, చావా రవి, జ్వాలా నర్సింహారావు, విజయరెడ్డితో పాటు కేతినేని హరీష్, సునీల్ మాదిగ, క్రాంతి, రాము తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ఎంపీ నామ నాగేశ్వరరావు**


సోషల్ మీడియా వారియర్లతో మాట్లాడుతున్న నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా సోషల్ మీడియా వారియర్స్ పనిచేయాలని ఖమ్మం ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు సూచించారు. వరంగల్ – నల్లగొండ – ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యాన గురువారం ఆయన ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వారియర్లతో సమావేశమయ్యారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న ఏనుగుల రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడంలో సోషల్ మీడియా వారియర్స్ కీలకంగా వ్యవహరించాలని తెలిపారు. సేవ చేయాలనే ఉన్నత ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చిన రాకేష్‌రెడ్డిని పట్టభద్రులు ఆదరించేలా ప్రచారం చేయాలని సూచించారు.

# డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల అంత్యక్రియలు పూర్తి

- పాడె మోసిన ఎంపీ రవిచంద్ర, నామా నాగేశ్వరరావు
- హాజరైన ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు


పాడె మోస్తున్న ఎంపీ రవిచంద్ర, నామా నాగేశ్వరరావు


రాయల మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పువ్వాడ నాగేశ్వరరావు

తల్లాడ: కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు అంత్యక్రియలు గురువారం మండలంలోని మిట్టపల్లిలో పూర్తయ్యాయి. ఈ సందర్భంగా అంత్యక్రియలకు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, రాయల అభిమానులు హాజరయ్యారు. ఆయన స్వగృహం నుంచి వ్యవసాయ క్షేత్రం వరకు అంతిమ యాత్ర కొనసాగగా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పాడె మోశారు. అలాగే, సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వివిధ పార్టీల నాయకులు పోటు ప్రసాద్, భాగం హేమంతరావు, మట్టా దయానంద్, జక్కంపూడి కృష్ణమూర్తి, బొర్రా రాజశేఖర్, కేతినేని హరీష్, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, అయిలూరి ప్రదీప్‌రెడ్డి, తూము వీరభద్రరావు, ఎంపీడీఓలు, నాయకులు చంద్రమౌళి, రవీందర్‌రెడ్డి, దిరిశాల దాసురావు, డి.వెంకట్‌లాల్, కాపా సుధాకర్, దగ్గుల రఘుపతిరెడ్డి, తాతా భాస్కర్‌రావు, దూపాటి భద్రరాజు, కాపా అప్పయ్య అంత్యక్రియల్లో పాల్గొని రాయల మృతదేహం వద్ద నివాళులర్పించారు.

# రూ.10లక్షల విలువైన గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ పోలీసులు

ఖమ్మంక్రైం: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తరలిస్తున్న రూ.10లక్షల విలువైన గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పక్కాగా అందిన సమాచారంతో పోలీసులు రైలులో తనిఖీలు చేస్తుండగా రెండు సూట్ కేసుల్లో తీసుకెళ్తున్న 26 కేజీల గంజాయిని గుర్తించారు. అయితే, గంజాయి తరలిస్తున్న వారు తప్పించుకున్నారని పోలీసులు తెలిపారు. కాగా, జిల్లాలోని పలు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల కాలంలో సుమారు 300కేజీల గంజాయిని ఇటీవల స్వాధీనం చేసుకున్నారని వెల్లడించారు. తనిఖీల్లో పాల్గొన్న సీఐ సీహెచ్.శ్రీనివాస్, సిబ్బంది సుధీర్, హరీష్, వెంకటేశంను డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ గణేష్ అభినందించారు.

# చెరువులో మట్టి తవ్వకాలపై రగడ


గుబ్బగుర్తి పెద్ద చెరువులో జేసీబీలతో తవ్వుతున్న దృశ్యం

**అడ్డుకున్న మత్స్యకారులు.. వాగ్వాదం**


వాగ్వాదానికి దిగిన ట్రాక్టర్ల యజమానులు, మత్స్యకారులు

కొణిజర్ల: కొణిజర్ల మండలం గుబ్బగుర్తి పెద్ద చెరువులో రెండు రోజులుగా మట్టి తవ్వకాలు సాగుతుండగా మత్స్యకారులు గురువారం అడ్డుకున్నారు. చేపల వేటే వృత్తిగా తాము జీవిస్తుండగా, ఇష్టానుసారం జేసీబీలతో గుంతలు తవ్వితే ప్రమాదాలు జరిగే అవకాశముందని పేర్కొన్నారు. ఐదు నుంచి ఆరు అడుగుల మేర గుంతలు తవ్వుతుండగా, అధికారులకు ఫిర్యాదు చేస్తే అనుమతి ఉందని చెబుతూ పరిశీలనకు కూడా రావడం ఆరోపించారు. ఈక్రమంలో ట్రాక్టర్ల యజమానులకు, మత్స్యకారులకు మధ్య వాగ్వాదం జరగగా ఎస్ఐ జె.శంకరరావు చేరుకుని చర్చించారు. ఎస్సీ కాలనీలో వర్షాకాలంలో ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బంది పడుతున్న దృష్ట్యా వైరా ఎమ్మెల్యేకు విన్నవించి మట్టి తీసుకెళ్తున్నామని ట్రాక్టర్ యజమానులు తెలిపారు. కానీ ట్రాక్టర్ మట్టి రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు అమ్ముకుంటున్నారని మత్స్యకారులు ఆరోపించారు. ఈ అంశంపై ఐబీ డీఈ నళినిని వివరణ కోరగా 11 మంది రైతులు పొలాలకు మట్టి తీసుకెళ్లడానికి అనుమతి తీసుకున్నప్పటికీ 2 నుంచి 3 అడుగుల కంటే లోతు తవ్వొద్దని స్పష్టం చేశారు. ఇక ఎమ్మెల్యే ఆదేశాలతో కొందరికి సీనరేజీ చెల్లించి ఇళ్లలోకి మట్టి తీసుకెళ్లేందుకు అనుమతించామని తెలిపారు.

### 11 డయేరియా కేసులు...

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వాస్పత్రిలో 11 డయేరియా కేసులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం పరిధిలో ఉన్న రెండు గ్రామాలు కుదుముల తోగు, కొత్తూరుకు చెందిన ప్రజలు కలుషిత నీటిని తాగి వాంతులు, విరేచనాలతో బాధపడుతూ స్థానికంగా ఉన్న ఆస్పత్రిలో చికిత్స పొందారు. మెరుగైన చికిత్స కోసం 11 మంది భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చేరారు. వీరిలో ఏడుగురు చిన్నారులు, నలుగురు మహిళలు ఉన్నారు. వీరిలో ఒక బాలింత ఉండగా, ఆమెను ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

### గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


గోపీనాథ్( ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి లావు గోపీనాథ్(30) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. తమిళనాడు రాష్ట్రం చెన్నైలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన ఇటీవల ఎన్నికల్లో ఓటు వేసేందుకు స్వగ్రామానికి వచ్చాడు. గురువారం ఇంట్లో పనిచేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురై కింద పడ్డాడు. దీంతో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించగా ఎంపీటీసీ జయలక్ష్మి తదితరులు సంతాపం తెలిపారు.

### సంప్‌లో పడి బాలుడు మృతి

సత్తుపల్లిటౌన్: నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద ఉన్న సంప్‌లో పడిన ఓ బాలుడు మృతి చెందాడు. ఒడిశా రాష్ట్రంలోని అస్కా గ్రామానికి చెందిన కేదారిదాస్, తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి మూడు నెలలుగా సత్తుపల్లి ద్వారకాపురి కాలనీ రోడ్డు–4లోని నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద తాపీ పనిచేస్తున్నాడు. గురువారం ఆయన కుమారుడు సాయిరాం(2)ను కూడా పని వద్దకు తీసుకెళ్లగా ఆడుకుంటూ మూతలేని సంప్‌లో ప్రమాదవశాత్తు పడిపోయాడు. కాసేపటికి గమనించిన కేదారిదాస్ వెతకగా సంప్‌లో కనిపించడంతో ప్రభుత్వాస్పత్రి తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ హరిప్రసాద్ తెలిపారు.

### గడ్డి మందు కొట్టిన చేనులో మేసిన 80 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న కాపరులు

తిరుమలాయపాలెం: గడ్డి మందు పిచికారీ చేసిన పెసర చేనులో మేసిన 80 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాజారం గ్రామానికి చెందిన పేర్ల కొమరయ్య, బయన్న, గాలయ్య, నరేష్‌ల గొర్రెలు బుధవారం కూసుమంచి మండలం లాల్‌సింగ్‌తండాలో పెసర చేను మేశాయి. అయితే, ఆ చేనులో గడ్డి మందు పిచికారీ చేసి ఉండడంతో అస్వస్థతకు గురైన గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.10లక్షల విలువైన గొర్రెలు మృత్యువాత పడిన నేపథ్యాన తమను ఆదుకోవాలని గొర్రెల కాపరులు కోరారు. ఈమేరకు బాధితులను న్యూడెమోక్రసీ నాయకులు మందుల రాజేంద్రప్రసాద్, గొర్రెపాటి రమేష్ పరామర్శించి తక్షణమే ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

### అద్దె బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రయాణికుల ఇక్కట్లు


లంకపల్లి స్టేజీ వద్ద ఆగిన బస్సు

పెనుబల్లి: బస్సు బయలుదేరుతున్నప్పుడే డీజిల్ సరిపడా ఉందా, లేదా అని చూసుకోవాల్సిన అద్దె బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. సత్తుపల్లి నుండి ఖమ్మం వైపు గురువారం బయలుదేరిన బస్సులో 70 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే, డ్రైవర్ పట్టింపు లేని తనంతో బస్సు పెనుబల్లి మండలం లంకపల్లి స్టేజీ వద్దకు వచ్చేసరికి డీజిల్ అయిపోయి ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు మండుటెండలో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. కొందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించగా, మరికొందరు ఇంకో బస్సు వచ్చే వరకు వేచి చూశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.